క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


నేహాసిని

కోటవురట్ల : కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్లో పదోతరగతి చదివిన తమరాన నేహాసిని ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఆర్‌జీకేయూటీ పరిధిలోని ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు రావడంతో ఆమె తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా విడుదల చేసిన రెండో జాబితాలో నేహాసిని చోటు దక్కడంతో పాఠశాల హెచ్‌ఎం షేక్ అల్లావుద్దీన్, ఉపాధ్యాయులు అభినందించారు. పదో తరగతి పరీక్షల్లో నేహాసిని 567 మార్కులు సాధించింది. మొదటి జాబితాలో పేరు లేకపోవడంతో ఒకింత నిరుత్సాహానికి గురికాగా రెండో జాబితాలో అవకాశం రావడంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తోంది. ఇంజినీరుగా మంచి స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల కలను నెరవేర్చాలన్నది తన ఆశయంగా నేహాసిని తెలిపింది.

సంపద కేంద్రాలను తనిఖీ చేసిన డీపీవో


పురుషోత్తపురంలో సంపద కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీపీవో శిరీషారాణి

యలమంచిలి రూరల్ : మండలంలోని పురుషోత్తపురం, బయ్యవరం గ్రామాల్లో గల సంపద తయారీ కేంద్రాలను శనివారం డీపీవో ఆర్. శిరీషారాణి తనిఖీ చేశారు. తడి, పొడి చెత్త ఏరివేత ఎలా జరుగుతుందో ఆరా తీశారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి సంపద కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సేంద్రియ ఎరువుల తయారీని విరివిగా చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ఇళ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట : పట్టణంలో ప్రభుత్వ ఐటీఐలో 2024–2025 సంవత్సరానికి అడ్మిషన్ల కోసం (మూడో విడత) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో ఐటీఐ ఎపి.జిఓవి.ఇన్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకుని, ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ప్రభుత్వ ఐటీఐ పాయకరావుపేటలో సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం ఒరిజినల్ ఎస్‌ఎస్‌సి, కులధ్రువీకరణ పత్రం, ఫొటో, ఈమెయిల్ ఐడీ, ఆధార్, ఆధార్ లింక్ ఫోన్ నంబర్ కలిగి ఉండాలని, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు తుది గడువు ఈ నెల 27వ తేదీ కాగా, కౌన్సెలింగ్ 29వ తేదీన ఉంటుందని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోని వారి పేరు మెరిట్ జాబితాలో ఉండదని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఐటీఐలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పచ్చని చెట్లు ప్రగతికి దోహదం


పాఠశాలలో మొక్కలు నాటుతున్న ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ

ఎస్.రాయవరం : పచ్చని చెట్లు ప్రగతి మెట్లు అని, కొరుప్రోలు ప్రధానోపాధ్యాయుడు సకురు సత్యనారాయణ అన్నారు. కొరుప్రోలు ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం పలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు , విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. పాఠశాలలో నాటుతున్న మొక్కలను ఎప్పటికప్పుడు పరిరక్షిస్తూ అవి ఎదిగేలా చూడాలన్నారు. విద్యార్థులు మొక్కలు పెంచడం అలవాటు చేసుకుంటే పరిసరాల నుంచి మంచి అవగాహన కలుగుతుందన్నారు.

నేడు 'విత్తనబంతులు విసిరే కార్యక్రమం'

అనకాపల్లి: మండలంలో సత్యనారాయణపురం పంచాయతీ పరిధిలో సత్యనారాయణ స్వామి కొండపై గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు 'విత్తనబంతులు విసిరే కార్యక్రమాన్ని' నిర్వహిస్తున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు స్థానిక నెహ్రూచౌక్ నుంచి క్లబ్ సభ్యులు అందరూ బయలుదేరనున్నట్టు చెప్పారు. సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

రాకోయి.. అనుకోని 'అతిథి'

లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన అతిథి గృహాలు అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వంతో నిరుపయోగంగా మారాయి. బ్రిటిష్ కాలం నాటి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం పూర్తిగా శిథిలం కాగా, 18 ఏళ్ల క్రితం రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన జెడ్పీ అతిథి గృహం నిర్వహణ లోపంతో కునారిల్లుతోంది.

- విశ్రాంతినివ్వని అతిథి గృహాలు
- శిథిలమైన రోడ్లు, భవనాలశాఖ అతిథి గృహం
- నిర్వహణ కొరవడిన జెడ్పీ గెస్ట్‌హౌస్
- ఆస్తులకు రక్షణ కరువు
- పట్టించుకోని అధికారులు


నిర్వహణ కొరవడిన జిల్లా పరిషత్ అతిథి గృహం

యలమంచిలి రూరల్ : లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన అతిథి గృహాలు అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వంతో నిరుపయోగంగా మారాయి. వందేళ్ల చరిత్ర కలిగిన ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ అధికారుల నిర్లక్ష్యంతో పూర్తిగా శిథిలమైంది. తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. బ్రిటిష్ పాలనలో నిర్మించిన ఈ విశ్రాంతి భవనంలో విలువైన టేకు, అకేషియా వంటి కలపను వినియోగించారు. రక్షణ లేకపోవడం, క్రమంగా ఈ గెస్ట్‌హౌస్‌ను సంబంధిత అధికారులు గాలికొదిలేయడంతో విలువైన కలప చోరీకి గురైంది. ఇతర ఇనుప వస్తువులను కూడా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఫర్నిచర్‌లో కొంత పాడైపోగా మరికొంత మాయమైంది. ఈ విశ్రాంతి భవనం నిర్వహణ బాగున్నపుడు ఉమ్మడి రాష్ట్రంలో పలువురు ఉన్నతాధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు తమ పర్యటనల్లో భాగంగా ఇక్కడ బస చేసేవారు. ప్రస్తుతం ఇది పూర్తిగా శిథిలం కావడంతో విలువైన ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయి. విశ్రాంతి భవనం ప్రాంగణంలో 60 ఏళ్ల క్రితం నుంచీ పెరుగుతున్న వృక్ష సంపదను దోచుకుపోతున్నారు. విశ్రాంతి భవన ప్రాంగణంలో ఏఈ కార్యాలయం ఉంది. ఈ భవనాన్ని రిటైరైన వాచ్‌మన్ కుటుంబం ఆక్రమించుకుని నివాసం ఉంటోంది. రోడ్లు భవనాల శాఖ, భారత జాతీయ రహదారుల అధికార సంస్థ అధికారులు ఈ గెస్ట్‌హౌస్ నిర్వహణ తమది కాదంటే తమది కాదంటూ కాలయాపన చేయడంతో ఈ గెస్ట్‌హౌస్ ఆస్తులతో పాటు స్థలానికి రక్షణ కరువైంది. ఈ రెండు శాఖల అధికారుల ఉదాసీనతతో విశ్రాంతి భవనం ఉన్న ప్రాంగణంలో ఇష్టారాజ్యం నడుస్తోంది.

జెడ్పీ గెస్ట్‌హౌస్ నిర్వహణ అధ్వానం

యలమంచిలి పట్టణంలోని కోర్టుకు వెళ్లే దారిలో ఉన్న జిల్లా పరిషత్ విశ్రాంతి భవనం నిర్వహణ కూడా అధ్వానంగా ఉంది. 18 ఏళ్ల క్రితం సుమారు రూ.50 లక్షల నిధులతో నిర్మించిన ఈ విశ్రాంతి భవనం నిర్వహణ మొదట్లో బాగుండేది. క్రమేణా దీని నిర్వహణపై స్థానిక మండల పరిషత్ అధికారులు చిన్నచూపు చూడడంతో ఆదరణ తగ్గింది. ఈ భవనంలో ఏసీలు, ఫ్యాన్లు,లైట్లు పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. పై అంతస్తులో గదులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నెలలు గడుస్తున్నా మరమ్మతు చేయించలేదు. ముఖ్యంగా మోటారు మొరాయించడంతో నీటి సరఫరా ఆగిపోయింది. భవనంలో గదులు, టాయిలెట్లకు నీటి సరఫరా లేకపోవడంతో ఈ విశ్రాంతి భవనాన్ని ఎవరూ అద్దెకు తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఉన్నతాధికారులు బస చేయడానికి వీలుగా రూ.2 లక్షలతో కొత్త ఫర్నిచర్, డోర్ కర్టెన్లు, ఇన్వర్టర్ వంటివి ఏర్పాటు చేశారు. అయినప్పటికీ జిల్లా పరిషత్ అధికారులు నిర్వహణను పట్టించుకోవడం లేదు. స్థానికంగా ఎంపీడీవోకు నిర్వహణ బాధ్యతలు అప్పగించినా ఇప్పటికే భారీగా పేరుకుపోయిన విద్యుత్ బిల్లుల బకాయిలు, ఇతర సమస్యల పరిష్కారానికి భారీగా నిధులు అవసరం. దీంతో ఈ విశ్రాంతి భవనం నిర్వహణ గాడిన పడలేదు. ఎవరికైనా అద్దెకు ఇవ్వాలన్నా అన్నిటికీ అవసరమైన నీటి సరఫరా లేకపోవడంతో భారీగా ఆదాయానికి గండి పడుతోంది. నిర్వహణపై శ్రద్ధ చూపి సమస్యలు పరిష్కరిస్తే అద్దె రూపంలో ఆదాయం సమకూరుతుంది. తద్వారా నిర్వహణకు ఆదాయం రావడంతోపాటు ఈ గెస్ట్‌హౌస్‌కు పూర్వ వైభవం వస్తుంది. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పదేళ్లుగా ఈ గెస్ట్‌హౌస్‌లో ఉన్నతాధికారులు గానీ ప్రజాప్రతినిధులుగానీ బస చేయడానికి ఇష్ట పడడంలేదు. ఇటీవల స్థానికులు కొందరు ఈ నెల 9, 10 తేదీల్లో అద్దెకు కావాలని సంప్రదించగా నీటి సరఫరా లేకపోవడంతో ఎంపీడీవో కార్యాలయం అధికారులు నో చెప్పారు. పట్టణంలో ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాల అద్దెలు ఎక్కువగా ఉండడంతో సామాన్య, మధ్యతరగతి వర్గాల వారికి అందుబాటు ధరలో ఉండే ఈ గెస్ట్‌హౌస్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.


గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో అనధికార నివాసంగా వినియోగిస్తున్న ఏఈఈ కార్యాలయం


పూర్తిగా శిథిలమైన ఆర్‌అండ్‌బీ అతిథి గృహం

మరమ్మతులకు నిధులు అవసరం

పట్టణంలో ఉన్న జిల్లా పరిషత్ విశ్రాంతి భవనానికి మరమ్మతులు చేయించాల్సి ఉంది. ప్రస్తుతం అత్యవసరంగా నీటిని పంపింగ్ చేసే మోటారు మరమ్మతుకు గురైంది. దీంతో ఎవరికీ అద్దెకు ఇవ్వడానికి వీలు పడడంలేదు. ఇంకా కొన్ని మరమ్మతు పనులు చేయించాల్సి ఉంది. వాటికి భారీగా నిధులు అవసరం. మరమ్మతులు చేయిస్తే అద్దెల రూపంలో ఆదాయం వస్తుంది. ఇటీవల సార్వత్రిక ఎన్నికల సమయంలో ఉన్నతాధికారులు బస చేయడానికి వీలుగా కొంత నిధులు వెచ్చించి వినియోగంలోకి తీసుకొచ్చాం. ఇంకా మరమ్మతులు చేయించాల్సి ఉంది.

–ఎంపీడీవో అప్పలనాయుడు

ఇసుక ట్రాక్టరు పట్టివేత


పట్టుకున్న ఇసుక ట్రాక్టరు

కోటవురట్ల : వరాహనది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాలివి. కొత్త గొట్టివాడ ప్రాంతంలోని వరాహనది నుంచి ట్రాక్టరులో ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో దాడి చేసి మెయిన్‌రోడ్డులో ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు తెలిపారు. పోలీసుస్టేషన్‌కు తరలించి అపరాధ రుసుముగా రూ.10 వేలు విధించినట్టు తెలిపారు. ఎక్కడైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

అడుగుకో గొయ్యి..మరమ్మతులేవీ..


యండపల్లి–అన్నవరం రహదారి దుస్థితి

కోటవురట్ల : ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామీణ రహదారులు మరింత దారుణంగా తయారయ్యాయి. ఏ ఊరెళ్లినా వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ఆదమరిస్తే గోతుల్లో పడి తీవ్రంగా గాయపడడం ఖాయం. ప్రధానంగా రాజుపేట, లింగాపురం, యండపల్లి–అన్నవరం రహదారుల్లో ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. పెద్ద గోతులు పడడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. యండపల్లి–అన్నవరం రహదారిలో అడుగుకో గొయ్యి ఉంది. దాంతో చీకట్లో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతు చేయాలని పలువురు కోరుతున్నారు.

బిడ్డకు తల్లి పాలే శ్రీరామరక్ష


నారాయుడుపాలెంలో తల్లిపాల వారోత్సవ ర్యాలీ


పెదపాడులో సదస్సులో మాట్లాడుతున్న వైద్యాధికారి కల్యాణి


అవగాహన ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది


రజాలలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

అచ్యుతాపురం : బిడ్డకు రెండేళ్ల వరకూ తల్లి పాలనే ఇవ్వాలని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కల్యాణి అన్నారు. పెదపాడు సచివాలయంలో తల్లి పాల వారోత్సవ విశిష్టత అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. తల్లి పాలను పిల్లలకు ఇవ్వడం ద్వారా తల్లికి, బిడ్డకు ఇద్దరికీ మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమామహేశ్, వైద్య సిబ్బంది వరలక్ష్మి, నాగలక్ష్మి, శివమ్మ, కరుణ పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిపాలు ఎంతో ఆరోగ్యకరం

పాయకరావుపేట పిల్లలకు తల్లిపాలు ఎంతో ఆరోగ్యకరం అని, ప్రతి బాలింత పుట్టిన పిల్లలకు తల్లి పాలు ఇవ్వాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌజన్య అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో గల రాజీవ్‌నగర్ కాలనీలో తల్లిపాలపై బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు 2 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు అదనపు ఆహారంతో పాటు తల్లి పాలు కూడా ఆహారంగా అందించాలన్నారు. తల్లిపాల వారోత్సవాల గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అందించాలి

మునగపాక : తల్లిపాలలో మెరుగైన పోషక విలువలు ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మిరాచి అన్నారు. పాటిపల్లి, నారాయుడుపాలెం, చిన్నోడుపాలెం గ్రామాల్లో శనివారం తల్లిపాల వారోత్సవ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలు అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఏఎన్‌ఎం పి.సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ దుర్గ, అంగన్‌వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి, ఆశ కార్యకర్త అప్పలనర్స కార్యక్రమంలో పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు దివ్యఔషధం

రాంబిల్లి (యలమంచిలి) : తల్లిపాలు బిడ్డకు దివ్య ఔషధం లాంటిది అని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాలతీదేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం రజాల, కుమ్మరాపల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బిడ్డకు తల్లి పాలు ప్రాముఖ్యతను బాలింతలకు తెలియపరచాలని, చంటి బిడ్డల్లో తల్లి పాలు వ్యాధినిరోధక శక్తిని పెంపొందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, జానకీదేవి, రమాదేవి పాల్గొన్నారు.

'వర్గీకరణపై పునఃపరిశీలన చేయాలి'


మునగపాక రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న దళితులు

మునగపాక : సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్ ఉప వర్గీకరణ విషయంలో ఇచ్చిన తీర్పును పునఃపరిశీలన చేయాలని కోరుతూ మునగపాకలో దళిత సంఘాల నేతలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం మునగపాక మెయిన్‌రోడ్డులో నిరసన వ్యక్తం చేశారు. పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో దళితులు రేబాక మధు, పిట్టా అప్పారావు, దిమ్మల అప్పారావు మాట్లాడారు. ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా చూడాలన్నారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించకుండా దళిత ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన రిజర్వేషన్‌లను విడగొట్టి వారి ఐక్యతను దెబ్బ తీస్తున్నారన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడుతున్న నాటకాలుగా అర్థమవుతుందన్నారు. షెడ్యూల్ కులాల జాబితాలో ఉన్న అన్ని వర్గాల వారికి న్యాయం చేయాలని కోరారు. అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుంట్ల అప్పారావు, గొంది అప్పారావు, పిల్లి అప్పారావు , శివ గణేష్, విష్ణు, గణేష్, ఉషా అప్పారావు , గెంజి రమణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


మిషన్ శక్తి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

నక్కపల్లి : మండలంలో సీతంపాలెం గ్రామంలో శనివారం సచివాలయ కార్యదర్శి జయప్రకాష్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధ్యాయుడు ఎస్.వి.ఎస్ ఆచార్యులు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించినా, చేపట్టినా చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లల చదువు అవనికే వెలుగని పేర్కొంటూ వారిని చదివిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గ్రామంలో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది బ్యూలారాణి మాట్లాడుతూ మిషన్ శక్తి వందరోజుల ప్రణాళికలో భాగంగా రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కల్యాణ్, గ్రామంలో తల్లిదండ్రులు, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, సత్యవతి, అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మి, అమ్మాజీ పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు నైట్ డ్యూటీలు నిలిపివేయాలి


తమ సమస్యలపై డిప్యూటీ తహసీల్దార్ మురళికి వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

యలమంచిలి రూరల్ : తమకు నైట్ డ్యూటీలు నిలిపివేసి, అర్హత వున్న వారికి అటెండర్, వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్, వీఆర్వో పోస్టులకు పదోన్నతి కల్పించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం యలమంచిలి డిప్యూటీ తహసీల్దార్ మురళికి వినతిపత్రం అంజదేశారు. వారికి సీఐటీయు జిల్లా నాయకుడు చింతకాయల శివాజీ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలు ఎన్నో రకాల సేవలందిస్తున్నారని, సుప్రీంకోర్టు చెప్పిన విధంగా కనీస వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. అటెండర్, వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్, వీఆర్‌వో పోస్టుల పదోన్నతులు కూడా చాలా కాలం నుంచి లేవని చెప్పారు. తక్షణమే వీఆర్‌ఏలకు నైట్ డ్యూటీలు నిలిపివేయాలని, వేధింపులు ఆపాలని కోరారు. రాంబిల్లి మండలంలో హరిపురం వీఆర్‌ఏ జోగా నూకరాజును ఆ మండల డీటీ, వీఆర్వోలు అనేక రకాలుగా వేధిస్తున్నారని, మధుమేహంతో బాధపడుతున్న నూకరాజుకు రోజూ రాంబిల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఉద్దేశపూర్వకంగా డ్యూటీలు వేస్తూ ఇబ్బందులకు గురిచేయడం తగదని శివాజీ అన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బూకా నరసింహులు, అప్పారావు, వరలక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం : బ్రాండిక్స్ సబ్ స్టేషన్‌లో ఈ నెల 4వ తేదీన మెయింటెనెన్స్ పనుల నిమిత్తం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలిపివేస్తున్ను కొండకర్ల సబ్‌స్టేషన్ ఏఈ కృష్ణ తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకూ బ్రాండిక్స్ పారిశ్రామిక వాడ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

పాయకరావుపేట : పట్టణంలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో గల 11 కేవీ తాండవ షుగర్ ఫ్యాక్టరీ ఫీడర్ బ్రేకర్, 11 కేవీ చక్కానగర్ ఫీడర్ మరమ్మతుల్లో భాగంగా బృందావనం, ధనిశెట్టినగర్, పండరిపురం, షీలానగర్, ఇందిరానగర్, లింగాలకాలనీ, రాజీవ్ కాలనీ, దుర్గానగర్, దుర్గాకాలనీ, శాంతినగర్, పీఎల్‌పురం జగనన్న కాలనీ, పెదిరెడ్డి లక్ష్మీనగర్, దేవీనగర్, చక్కానగర్, ఆనంద్‌నగర్ కాలనీ, ప్రకాష్ కాలేజ్ ఏరియా, దొరకాలనీ, నామవరం, సీతారాంపురం పరిసర ప్రాంతాలకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు.

భూ వివరాలు మార్చేసిన అధికారులపై చర్యకు వినతి


ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్‌కు వినతి అందజేస్తున్న దృశ్యం

మునగపాక : తమ భూముల వివరాలను రికార్డుల్లో లేకుండా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నారాయుడుపాలెం గ్రామానికి చెందిన రైతులు శనివారం ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్‌కు వినతి అందజేశారు. 1999 నుంచి నారాయుడుపాలేనికి చెందిన 25 మంది రైతులు కొండబంజరు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, 2009లో సంబంధిత భూములకు అప్పటి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందన్నారు. వన్‌బీలో కూడా తమ పేర్లు కనిపించేవని, గతంలో రైతు భరోసా, పీఎం కిసాన్ వంటి పథకం అందేదన్నారు. అయితే ఇటీవల వన్‌బీతోపాటు రికార్డుల్లో కూడా తమ పేర్లు కనిపించకుండా అధికారులు తొలగించారన్నారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి అందజేశారు. వినతి అందజేసిన వారిలో ఏదిరి లక్ష్మి, రాము, యర్రా అప్పలనర్స, నాగమణి, చందనాటి కాశీరావు, ఇల్లపు అప్పలనాయుడు, కాకర లక్ష్మి తదితరులున్నారు.

మహిళ ఆచూకీ కోసం పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన



పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న మహిళా బంధువులు, గ్రామపెద్దలు

రాంబిల్లి (యలమంచిలి): అదృశ్యమైన మహిళ ఆచూకీ కనుగొనడంలో పోలీసులు నిర్లక్ష్యం చూపుతున్నారంటూ రాంబిల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఆ మహిళ బంధువులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. రాంబిల్లి మండలం లాలం కోడూరు శివారు పెదయాతపాలెం గ్రామానికి చెందిన కొల్లి అపర్ణ కొన్ని నెలల క్రితం అచ్యుతాపురంలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో బంగారు లోన్ వడ్డీ కట్టడానికి వెళ్లి తిరిగి ఇంటికి తిరిగి చేరుకోలేదు. దీంతో రాంబిల్లి పోలీస్ స్టేషన్‌లో ఆమె భర్త అప్పలనాయుడు ఫిర్యాదు చేశాడు. అదృశ్యమైన మహిళ ఆచూకీ కోసం కొన్ని నెలలు నుంచి పోలీసులను ప్రశ్నిస్తున్నా సరైన సమాధానం చెప్పడం లేదని బంధువులు ఆరోపించారు. దీనికి నిరసనగా కులసంఘం పెద్దలతో కలిసి వారు రాంబిల్లి పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీఐ నర్సింగరావు మాట్లాడుతూ మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేశామని, త్వరలోనే ఆచూకీ కనుగొంటామని తెలిపారు. అనంతరం మహిళ బంధువులు, గ్రామ పెద్దలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేసి వెళ్లిపోయారు.

పారిశుధ్య పనుల పునరుద్ధరణ



ఎస్.రాయవరంలో పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో పారిశుధ్య పనులు శనివారం నుంచి ప్రారంభించారు. టెండరు ఖరారు విషయంలో రెండు రోజులు జాప్యం కావడంతో సాక్షి దినపత్రికలో శనివారం ఎస్.రాయవరంలో నిలిచిన పారిశుధ్య పనులు అనే శీర్షికన వార్త ప్రచురితమయ్యింది. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు శనివారం కొత్తగా కొందరు సిబ్బంది ఏర్పాటు చేసి వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రం చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రెగ్యులర్‌గా పనులు చేసే సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.